సాక్షి ఒడిశా
శనివారం, 15, మార్చి, 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 7,60,960
బంగారం : 1 గ్రాము
వెండి : 10 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



25 మందికి అస్వస్థత

మల్కన్‌గిరి పరిధిలో 25 మంది ఆస్పత్రి పాలయ్యారు. వీరు విషపు పుట్టగొడుగులు తిన్నారు.

- 8లో



మత్తులో యువతి వీరంగం

భువనేశ్వర్ వద్ద ఓ యువతి వీరంగం వేసింది. మద్యం మత్తులో దాడికి పాల్పడింది.

- 8లో

నీలావడి.. భక్తుల సందడి



పూజలందుకుంటున్న నీలావడి అగ్నిగంగమ్మ అమ్మవారు



రాణి దుర్గ మందిరం



పూజా పెండాల్



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

రాయగడ: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న నీలావడి అగ్నిగంగమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఈ నెల పదో తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభం కాగా.. శుక్రవారం మందిరం భక్తులతో కిటకిటలాడింది. ఇటు ఒడిశాతో పాటు సరిహద్దు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు కూడా అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు.

ఆదివాసీల పండగ

నీలావడి అమ్మవారిని ఈ ప్రాంత ఆదివాసీలు భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. జాతర సమయంలో వారు మొక్కులు తీర్చుకుంటారు. అదేవిధంగా ముందుగా ఇంటిలో పూజించిన ఘటాలను ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాలతో ఘటాలను తీసుకువచ్చి అమ్మవారి జాతర జరిగే ప్రాంతానికి తీసుకువచ్చి మొక్కుబడులను తీర్చుకోవడం ఆనవాయితీగా భావించి ఈ మేరకు పూజలను నిర్వహిస్తారు.

రాణిగుర్గా అమ్మవారు

నీలావడి జాతరను సందర్శించే భక్తులు రాయగడ మీదుగా నీలావడి వెళ్లే రహదారి పుల్‌కొన కూడలికి సమీపంలో ఉన్న రాణి దుర్గ అమ్మవారిని కూడా దర్శించుకుంటారు. ఎత్తయిన పర్వతాలు, లోయలు, కొండల నడుమ ప్రయాణం చేయాల్సి ఉండటంతో ఈ మార్గంలో ప్రయాణించే వారు రాణిదుర్గ అమ్మవారి మందిరం వద్ద తమ వాహనాలను నిలిపి మొక్కుకుంటారు.

రహదారులు కావవి..

రాయగడ నుంచి నీలావడికి వెళ్లేందుకు సుమారు 50 కిలోమీటర్ల దూరం ప్రయాణం ఉంటుంది. బస్సులు, ద్విచక్రవాహనాలతో పాటు, అద్దెకు లభించే కారులు వంటి వాహనాల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వెళుతున్నారు. అయితే రాయగడ నుంచి పుల్‌కోన కూడలి నుంచి ఆరు కిలోమీటర్ల దూరం గల రహదారి రాళ్లు దేరడంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏళ్లు గడిచినా రహదారులు మెరుగుపడకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతుంది.

పార్వతీపురం నుంచి బస్సులు

పొరుగు రాష్ట్రమైన ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన పార్వతీపురం డిపో నుంచి ఈ ఏడాది అమ్మవారి జాతర స్పెషల్‌గా సుమారు 40 బస్సులను నడిపించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీంతో ఈ ఏడాది అమ్మవారి దర్శనం కోసం మరింత మంది ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నట్లు జాతర నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా జాతర చివరి రోజు బుధవారం నాడు సుమారు రెండు లక్షల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని ముందుగానే అంచనా వేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



రాళ్లు దేరిన రహదారులు



అందమైన లోయలు



అమ్మవారి మందిరం వద్ద భక్తుల తాకిడి

న్యూస్‌రీల్

నిత్యావసర సరుకులు పంపిణీ



పేదలకు నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక రైతుల కాలనీలోని నవజీవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలైన 40 మంది ఆదివాసీ మహిళలకు నిత్యావసర సరుకులను ట్రస్టు నిర్వాహకురాలు ఎం.నళిని శుక్రవారం పంపిణీ చేశారు. ప్రతీనెల ఇటువంటి తరహా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేరుస్తాం



మాట్లాడుతున్న మాజీ మంత్రి అరవింద డాలి

మల్కన్‌గిరి: ఎన్నికల హామీలను తప్పనిసరిగా నెరవేరుస్తామని బీజేపీ నాయకుడు, మాజీ మంత్రి అరవింద డాలి అన్నారు. శుక్రవారం జిల్లాకు విచ్చేసిన ఆయన స్థానిక సర్క్యూట్ హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి విమానయాన సేవలు త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అలాగే రైల్వేలైన్ కోసం కోసం సర్వే పూర్తయిందని, స్థలం విషయంపై త్వరలో చర్చిస్తామని వెల్లడించారు. అనంతరం కలిమెల సమితి ఎంవీ 90, ఎంవీ 96, కంగుకొండ, కన్యాశ్రమంలో నిర్మిస్తున్న కొత్త వంతెన పనులను పరిశీలించారు. గిరిజన గ్రామాల్లో వైద్యసేవలు, రహదారి నిర్మాణాలు, తాగునీటి, సాగునీటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సమావేశంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు గణేష్ మండల్, మాజీ అధ్యక్షుడు నిమాయి చంద్ర పాల్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లను సంరక్షించుకోవాలి




అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: ప్రతి ఒక్కరూ కళ్లను సంరక్షించుకోవాలని డాక్టర్ నమ్రత సూచించారు. శుక్రవారం అంతర్జాతీయ కాటరాక్ట్ డే పురస్కరించుకొని స్థానిక నమ్రిత కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జనాభాలో 90 శాతం మందికి కాటరాక్ట్‌పై అవగాహన లేకపోవడంతోనే అంధత్వం బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కంటి సమస్యలపై డాక్టర్లను తక్షణమే సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ్ మందిర పునః నిర్మాణానికి భారీ విరాళం

- రూ.50 లక్షలు ప్రకటించిన ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి

పర్లాకిమిడి: పర్లాకిమిడి పట్టణంలోని రాజవీధిలో పునః నిర్మాణం చేస్తున్న శ్రీజగన్నాథ మందిరానికి రూ. 50 లక్షలు విరాళంగా అందజేయనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి ప్రకటించారు. స్థానిక రాంనగర్ హైటెక్ ప్లాజాలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. జగన్నాథ మందిర నిర్మాణానికి ఇదివరకూ రాష్ట్ర ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసింది. అనేక ఏళ్లుగా నత్తనడకన సాగుతున్న మందిర పనులు ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుండగా మరో పక్క ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ముందుకు రావడంతో మందిర నిర్మాణం పూర్తవ్వగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే మందిర నిర్మాణానికి అమెరికా, యు.కె.నుంచి కూడా ఒడియా ఎన్.ఆర్.ఐ.లు విరాళాలు ద్వారా చేయూత అందిస్తామంటున్నారని చెప్పారు. ఎలాగైనా మందిరం పనులు పూర్తిచేసి శిఖరంపై జెండా ఎగుర వేయాలన్నారు. విలేకరుల సమావేశంలో పురపాలక సంఘం అధ్యక్షురాలు నిర్మలా శెఠి, బీజేడీ నాయకులు ప్రదీప్ నాయక్ ఉన్నారు.

మహాలక్ష్మికి లక్ష చామంతులతో పూజలు



లక్ష చామంతులతో పూజలందుకున్న లక్ష్మీదేవి



పూజల్లో పాల్గొన్న మహిళలు

రాయగడ: స్థానిక కస్తూరీనగర్‌లోని శ్రీ సత్యనారాయణ స్వామి వారి దేవాలయంలో పౌర్ణమి మహాలక్ష్మి దేవి తురునక్షత్ర పూజలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు పులకండం రఘునాయకుల శర్మ, మావుడూరు కిశోర్ శర్మల ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో భాగంగా మహాలక్ష్మికి ప్రీతికరమైన సుహాసినులు, ముత్తైదువులు, కన్నెపిల్లలు సర్వసౌభాగ్యాలు కోరుకుంటూ అమ్మవారికి లక్ష చామంతులతో పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉగాది వేడుకలకు సన్నాహాలు



పూజా కార్యక్రమంలో కొండబాబు తదితరులు



మూహూర్తపు రాటను వేస్తున్న మహిళలు

రాయగడ: ఉగాది ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు స్థానిక ఉత్కళ తెలుగు సమాఖ్య సన్నహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా స్థానిక కొల్లిగుడ మైదానంలో వేడుకలను నిర్వహించేందుకు సమాఖ్య అధ్యక్షుడు యాల్ల వేంకటేశ్వర రావు (కొండబాబు) ఆధ్వర్యంలో శుక్రవారం మూహూర్తపు రాట పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. జిల్లా బీజేపీ అధ్యక్షులు గోపి ఆనంద్, పట్టణ ప్రముఖులు చంద్ర మౌళి కుముంధాన్, రాఘవ కుముంధాన్, కళింగ వైశ్య సంఘం అధ్యక్షులు కింతలి అమర్‌నాథ్, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నెల 30, 31 తేదీల్లో ఉగాది వేడుకలను అత్యంత వైభంగా నిర్వహించేందుకు సన్నహాలు చేస్తున్నట్లు కొండబాబు తెలిపారు. రెండు రోజుల పాటుగా జరిగే వేడుకల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

జయనారాయణ వ్యాఖ్యలపై కార్మిక నేతల ధ్వజం



సమావేశంలో నళినీకాంత రథో తదితర నాయకులు

జయపురం: సంబల్‌పూర్ ఎమ్మెల్యే జయనారాయణ మిశ్ర ఇటీవల చేసిన వాఖ్యలను జయపురం సిటీ కోఆర్డినేషన్ కమిటీ(జయపురం కార్మిక, ప్రజాసంఘాల సమన్వయ కమిటీ)తీవ్రంగా ఖండించింది. గురువారం స్థానిక కార్మిక భవనంలో కార్మిక నేత సిటీ కోఆర్డినేషన్ ఉపాధ్యక్షుడు నళినీకాంత రథో అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. వందే ఉత్కళ జననీ సంగీతం పై అవమానకరంగా మాట్లాడటమే కాకుండా పశ్చిమ ఒడిశాను ఒడిశాలో కలపటం చారిత్రిక తప్పిదమని వాఖ్యానిస్తూ రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసేందుకు బహిరంగంగా మాట్లాడటం క్షమించరాని నేరమని సమావేశం తెలిపింది. ఎమ్మెల్యేపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. అనంతరం సమావేశం మూడు తీర్మానాలు చేసింది. కేసీసీ బ్యాంకు ముందు ధర్నా, గుడారిలో పెన్షన్ల పెంపు డిమాండ్, సేవా పేపరు మిల్లు సమస్యల పరిష్కారంపై తీర్మానించారు. సమావేశంలో కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి, పి.గౌరీశంకర్ రావు, ఉమాకాంత రథో, కిశోర్ పండ, సంజయ మరిఖి, నీలమాధవ కుంభార్ తదితరులు పాల్గొన్నారు.

• షిర్డీసాయి తిరువీధి ఉత్సవం

పర్లాకిమిడి: పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలో షిర్డీసాయి ఉత్సవ విగ్రహాన్ని శుక్రవారం పల్లకీలో ఉంచి తిరువీధి నిర్వహించారు. మధ్యాహ్నం మటియా వీధిలోని షిర్డీ మందిరం వద్ద అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో షిర్డీసాయి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



స్వామివారికి తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం



ప్రమాద దృశ్యం

భువనేశ్వర్: 16వ నంబరు జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఖుర్దా జిల్లా బలుగావ్ ప్రాంతం నువాగొడా వద్ద ఉన్న ఓవర్ బ్రిడ్జి సమీపంలో శుక్రవారం రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని కారు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో దంపతులు దుర్మరణం పాలయ్యారు. మృతులు గంజాం జిల్లా అస్కాకు చెందిన శివరామ్ పాఢి, అతని భార్యగా గుర్తించారు. ఆ దంపతులు భువనేశ్వర్ నుంచి బరంపురం వెళ్తుండగా మధ్యాహ్నం సమయంలో ఈ ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షుల కథనం. స్తంభాన్ని ఢీకొన్న ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. అగ్నిమాపక దళం ఘటనా స్థలం సందర్శించి కారులో చిక్కుకున్న దంపతుల్ని బయటకు తీశారు. ఈ సన్నాహంలో గ్యాస్ కట్టర్ ఉపయోగించాల్సి వచ్చింది. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న దంపతుల్ని తక్షణమే సమీపంలో ఉన్న బణొపూర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వారు మరణించినట్లు ప్రకటించారు. బలుగాంవ్ ఠాణా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

నాగావళిలో బాలుడి దుర్మరణం



మృతుడు సాయికృష్ణ

రాయగడ: స్థానిక చెక్కాగుడ సమీపంలోని నాగావళి నదిలో మునిగి ఒక బాలుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మృతుడు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విజయవాడలోని పాడుమెట్టలో నివసిస్తున్న పి.మురళి కుమారుడు సాయికృష్ణ(16)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పి.మురళి కుటుంబంతో సహా మొత్తం 16 మంది మజ్జిగౌరి అమ్మవారి దర్శనానికి వచ్చారు. అనంతరం చెక్కాగుడలోని రోప్‌వే బ్రిడ్జిని సందర్శించేందుకు వెళ్లారు. రోప్ వే బ్రిడ్జి కింద పారుతున్న నాగావళి నదిలో సాయికృష్ణ స్నానానికి దిగాడు. ఈ సందర్భంగా నది మధ్యలోకి వెళ్లి ఫొటోలు తీసుకునే ప్రయత్నం చేశాడు. దీంతో నది తీవ్రతకు అదుపుతప్పి కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. ఇటువంటి తరహా ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటుండడంతో జిల్లా యంత్రాంగం రోప్ వే బ్రిడ్జిని నిషేధిస్తూ పర్యాటకులు వెళ్లకుండా ప్రవేశ ద్వారాన్ని ఇదివరకే మూసివేసింది. అయితే కొంతమంది పర్యాటకులు రోప్ వేని చూసేందుకు వెళ్లి ఇలా ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

అక్రమ ఆయుధ కర్మాగారం గుట్టురట్టు

- 7 ఎంఎం పిస్టల్ తయారీ సామగ్రి జప్తు
- నలుగురు నిందితులు

భువనేశ్వర్: రాష్ట్రంలో అక్రమ ఆయుధ కర్మాగారం గుట్టు రట్టు అయింది. కటక్ జిల్లా బొయాలిష్ మౌజా (బెంట్కర్) పోలీస్ ఠాణాకు కొన్ని మీటర్ల స్వల్ప దూరంలో బొడొ ధులేశ్వర్ ప్రాంతంలోని ఒక ఇంటిలో ఈ కర్మాగారం పని చేస్తున్నట్లు ప్రాథమిక సమాచారం. అక్రమ ఆయుధ కర్మాగారం వ్యవహారం బట్టబయలు కాకుండా ప్రధాన ఆవరణలో గోశాల నిర్వహిస్తూ లోపల ఆయుధాల తయారీ యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. రహస్య సమాచారం ఆధారంగా ప్రత్యేక టాస్కు దళం స్థానిక పోలీసులతో వ్యూహాత్మకంగా దాడి చేసి మొత్తం వ్యవహారం బట్టబయలు చేసింది. ఈ నెల 13న జరిగిన దాడిలో 4 మంది అంతర్ రాష్ట్ర నేరస్థులను అరెస్టు చేసినట్లు ఎస్‌టిఎఫ్ డీఐజీ పినాక్ మిశ్రా శుక్ర వారం తెలిపారు.


తుపాకీ స్మగ్లర్లను హౌరాకు చెందిన మహ్మద్ అజామ్ అలియాస్ బుధు (45), బీహార్ ముంగేర్ ప్రాంతీయులు మహ్మద్ అబిద్ హుస్సేన్ (49), మహ్మద్ సమ్సేర్ అల్లం అలియాస్ కల్లు (46) మరియు అక్రమ ఆయుధాలు తయారు చేస్తున్న ఇంటి యజమాని శరత్ చంద్ర యాదవ్ (58)గా గుర్తించారు. ఎస్‌టీఎఫ్, స్థానిక పోలీసుల సంయుక్త దాడిలో 7 ఎంఎం పిస్టల్స్ తయారీకి అవసరమైన ముడి సరుకుతో భారీ స్థాయిలో సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 29 సెమీ-ఫినిష్డ్ ఇంప్రూవైజ్డ్ పిస్టల్స్, 80 పిస్టల్ బాడీలు, 14 స్లైడర్లు, 36 గ్రిప్‌లు, 14 ఇనుప కడ్డీలు, 15 బ్యారెల్లు ఉన్నాయి. లాత్, మిల్లింగ్, డ్రిల్లింగ్, గ్రైండింగ్ యంత్రాలు వంటి అధునాతన తయారీ పరికరాలు, అనేక చేతి పనిముట్లు, ముడి పదార్థాలను కూడా స్వాధీనం చేసుకున్నారు.

కొంత మంది అంతర్ రాష్ట్ర నేరస్తులు అక్రమ తుపాకీలను తయారు చేస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారం ఆధారంగా ఈ దాడి నిర్వహించినట్లు పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయుధ చట్టం, 1959లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగుతుందన్నారు. శరత్ చంద్ర యాదవ్ నివాసం ప్రవేశ ద్వారం వద్ద ఒక కృత్రిమ గోశాలను ఏర్పాటు చేసి గత ఒకటిన్నర సంవత్సరాలుగా అక్రమ కర్మాగారం నిర్వహిస్తున్నట్లు ధ్రువీకరించారు. నిందితులు పటిష్టమైన వ్యవస్థీకృత సరఫరా గొలుసును బలపరచుకుని అనేక రాష్ట్రాల్లో విక్రయిస్తున్నారు. తుపాకీ తయారీ వర్క్‌షాప్ గురించి ఇంటి యజమానికి తెలుసునని, ఆ యూనిట్‌ను రహస్యంగా నడపడానికి అతడు గోశాలను ఏర్పాటు చేశాడని ఎస్‌టీఎఫ్ డీఐజీ పినాక్ మిశ్రా తెలియజేశారు. నిందితుల్లో ఒకరైన అజామ్ అలియాస్ బుధుపై హత్య ఆరోపణ ఉండగా మరో నిందితుడిపై కొన్ని నేర ఆరోపణలు ఉన్నాయని సీనియర్ అధికారులు తెలిపారు. సంప్రదాయ యంత్రాలను ఉపయోగించి అక్రమ తుపాకీలను తయారు చేయడంలో వీరికి నైపుణ్యత ఉంది. ఆయుధాల అక్రమ తయారీ, సరఫరా, విక్రయాల వ్యవహారాల్లో ఇతర వర్గాలతో సంబంధాలకు సంబంధించి ఆరా తీసే దిశలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

తుపాకీల తయారీకి అవసరమైన ముడి పదార్థాలను కటక్, పశ్చిమ బెంగాల్ నుంచి సేకరిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ ముఠా పాక్షికంగా తయారైన తుపాకీలను ఒక్కొక్కటి రూ. 15,000 నుండి రూ. 20,000 వరకు విక్రయిస్తుంటారు. పూర్తిగా తయారైన ఒక్కో పిస్తోలు ధర రూ. 50,000 పైబడి ఉంటుందని భావిస్తున్నారు. ఇక్కడ తయారు చేసి ఒడిశా లేదా వెలుపల సరఫరా చేసిన మొత్తం ఆయుధాల సంఖ్యను పరిశీలిస్తున్నామని ఎస్‌టీఎఫ్ అధికారులు తెలిపారు.



ఎస్‌టీఎఫ్ దాడుల్లో చేజిక్కించుకున్న అక్రమ ఆయుధ తయారీ సామగ్రి



గోశాల ముసుగులో తుపాకుల తయారీ పని ముట్లు



అక్రమ ఆయుధ కర్మాగారంలో సరంజామా పరిశీలిస్తున్న దర్యాప్తు అధికారి

క్లుప్తంగా

అయ్యో..శిశువు

జయపురం: స్థానిక పోస్టల్ కాలనీ వెనుక శుక్ర వారం ఓ శిశువు మృతదేహం కనిపించింది. స్థానికులు సమాచారం అందించడంతో పట్టణ పోలీసులు అక్కడకు వచ్చారు. శిశువు మృతదేహాన్ని మెజిస్ట్రేట్ సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. శిశువు పుట్టి రెండు రోజులై ఉంటుందని భావిస్తున్నారు. ఎవరు ఈ పనిచేశారో తేల్చేందుకు ఓ టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఆ టీమ్‌లో పోలీసు అధికారి సచిన్ ప్రధాన్, ఏఎస్ఐ మణీషా సాహు ఉన్నారు.

పలు జిల్లాలకు వడగాడ్పుల హెచ్చరిక

భువనేశ్వర్: రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వడగాడ్పుల వాతావరణం కొనసాగుతుందని శుక్ర వారం భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. రాష్ట్రంలో ప్రాంతాల్లో శుక్ర వారం అత్యధిక వేడిమి నమోదైంది. ఝార్సుగుడలో అత్యధిక గరిష్ట ఉష్ణోగ్రత 40.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో సంబల్‌పూర్ తదుపరి స్థానంలో నిలిచింది. శనివారం ఇదే వాతావరణం నెలకొని ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది.

నారింజ హెచ్చరిక

ఐఎండీ తాజా సూచన ప్రకారం రాష్ట్రంలోని అనేక జిల్లాలకు నారింజ రంగు హెచ్చరిక జారీ అయింది. ఝార్సుగుడ, సంబల్‌పూర్, మయూర్‌భంజ్, సుందర్‌గఢ్, బౌధ్, బొలంగీర్ జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల సాధారణం నుంచి తీవ్రమైన వడగాడ్పులు వీస్తాయని తెలిపారు.

గురండిలో స్వచ్ఛభారత్



చెత్తను తొలగిస్తున్న ప్రజలు

పర్లాకిమిడి: గుసాని సమితి గురండి గ్రామంలో పంచాయతీ అధికారులు, పోలీసు సిబ్బంది, వైద్య సిబ్బంది స్వచ్ఛభారత్ శుక్రవారం చేపట్టారు. ఆరుబయట మలవిసర్జన చేయరాదని, తడి, పొడిచెత్త గ్రామ పంచాయతీ చెత్త వాహనాల్లో వేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో గురండి పోలీసు అధికారి ఓంనారాయణ పాత్రో, గురండి స్వాస్థ్య విస్తరణాధికారి మమతా పాడి, సర్పంచ్ శిల్పా పాత్రో తదితరులు పాల్గొన్నారు.

చెన్నైలో వలస మత్స్యకారుడు మృతి



శ్యాంసుందరరావు మృతదేహం

సోంపేట: మండలంలోని ఇస్కలపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు సీరాపు శ్యాంసుందరరావు(38) చెన్నైలో చేపల వేట సాగిస్తూ మృతిచెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..శ్యాంసుందరరావు నెల రోజుల కిందట చెన్నై వలస వెళ్లాడు. సముద్రంలో చేపల వేట సాగిస్తుండగా ప్రమాదవశాత్తు బోటు బోల్తాపడటంతో శుక్రవారం మృతి చెందాడు. శ్యాంసుందరరావుకు భార్య భానుమతి, కుమారుడు కుమారస్వామి ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ప్రాణం తీసిన నిద్రమత్తు!

- లారీని కారు ఢీకొట్టిన ఘటనలో తమిళనాడు వ్యక్తి మృతి
- జరజాం ఫ్లై ఓవర్ సమీపంలో ఘటన



ప్రమాదానికి గురైన కారు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని జరజాం జంక్షన్ ఫ్లై ఓవర్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న కారు ముందు వెళుతున్న లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటన జరిగాక లారీ ఆపకుండా వెళ్లిపోయింది. ఆ సమయంలో అక్కడే ఉన్న కల్లుగీత కార్మికుడు వెంటనే స్థానికుల సాయంతో అత్యవసర విభాగాలకు ఫోన్ చేయడంతో ఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. స్టీరింగ్ వద్ద ఇరుక్కున్న వ్యక్తిని బయటకు తీయగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. అతని వద్ద లభించిన ఆధారాల మేరకు తమిళనాడు రాష్ట్రం అవడి పట్టణానికి చెందిన ఆకాష్ (29)గా గుర్తించారు. ఇతను ఎల్అండ్‌టీ పరిశ్రమలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. ఫోన్ నంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యులు వచ్చాక ఫిర్యాదు స్వీకరించి కేసు దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై నక్క కృష్ణారావు తెలిపారు. అతివేగం, నిద్రమత్తు కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. కాగా, గత కొంత కాలంగా ఎచ్చెర్ల పరిధిలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

సంప్రదాయబద్ధంగా.. హలపొడ ఉత్సవం



ఎగిసిపడిన హలపొడ మంటలు



భక్తులను ఆకట్టుకున్న బొమ్మల దుకాణాలు



నగర సంచారం చేస్తున్న దేవతామూర్తులు



రాధాకృష్ణులకు పూజలు చేస్తున్న పూజారి



పూజలందుకుంటున్న రాధాకృష్ణులు



యాత్రలో ఆదివాసీలు ఏర్పాటు చేసిన దుకాణాలు

జయపురం: జయపురం మహారాజుల కాలం నాటి నుంచి సంప్రప్రదాయంగా వస్తున్న హలపొడ ఉత్సవం గురువారం అర్ధరాత్రి జయపురం బంక మఠం ప్రాంతంలో ఘనంగా జరిగింది. దేవదాయ, ధర్మాదాయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించి ఉత్సవాన్ని తిలకించేందుకు జనం పోటెత్తారు. డోలా జాత్ర సందర్భంగా గురువారం రాత్రి పట్టణంలో దేవతా మూర్తులు నగర సంచారం చేశారు. అతి సుదరంగా అలంకరించిన విమానాలలో (అందమైన పల్లకీలు) మదన మోహనుడు, వల్లభ నారాయణుడు, కుంజబిహారీ, రాధాకృష్ణులు నాలుగు విమానాలలో నగర సంచారం చేసి హలపొడ ప్రాంతానికి చేరుకున్నారు. దేవతా మూర్తులకు పూజారి సంప్రదాయ పూజలు చేసి నిప్పును వెలిగించారు. శుక్రవారం డొలమండప వీధిలోని రాధాకృష్ణ ఆలయంలో ఘనంగా పూజలు జరిగాయి. డోలాపౌర్ణమి సందర్భంగా ఆ ప్రాంతంలో యాత్ర జరిగింది. యాత్రలో ఆదివాసీలు విక్రయించిన వివిధ వస్తువుల కొనుగోలుకు భక్తులు ఆసక్తి చూపారు.

విషపు పుట్టగొడుగులు తిని 25 మందికి అస్వస్థత



చికిత్స అందజేస్తున్న వైద్యులు



రోగి బంధువులతో చర్చిస్తున్న కాంగ్రెస్ నేత గోవింద పాత్రో



చికిత్స పొందుతున్న యువకుడు



అస్వస్థతతో వృద్ధురాలు

మల్కన్‌గిరి:

మల్కన్‌గిరి జిల్లాలో విషపు పుట్టగొడుగులు తిని 25 మంది అస్వస్థతకు గురై జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మత్తిలి సమితి నాయిక్‌గూడ పంచాయతీ కోహిలిపల్లి గ్రామానికి చెందిన కొందరు మల్కన్‌గిరిలో జాతర కోసం జాయపూరియాగూఢ వీధికి వచ్చారు. గురువారం పన్నీరు, పుట్ట గొడుగులు కొన్ని తెచ్చి కూర చేసుకుని తిన్నారు. ఆ సమయంలో ఒకరికి కడుపు నొప్పి వచ్చింది. అలా వాంతులు కూడా మొదలయ్యాయి. మొత్తం 25మంది అస్వస్థతకు గురి కావడంతో వారిని మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. విషపు పుట్టగొడుగులు తినడం వల్లే ఇలా జరిగిందని వైద్యులు ప్రఫుల్ల కుమార్ బెహరా తెలిపారు. రోగులను పరామర్శించేందుకు జిల్లా కాంగ్రెస్ గోవింద పాత్రో వెళ్లారు.

మత్తులో యువతి వీరంగం





మత్తులో యువతి వీరంగం దృశ్యాలు

భువనేశ్వర్: నగరంలో మద్యం మత్తులో ఓ యువతి వీరంగం చేసింది. స్థానిక చంద్రశేఖర్‌పూర్ ప్రాంతం మద్యం దుకాణం ముందు ఈ సన్నివేశం తారస పడింది. సమాచారం అందుకున్న పోలీసులు యువతిని అదుపులోకి తీసుకుని స్థానిక క్యాపిటల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రయత్నంలో పోలీసులు, ఆస్పత్రి సిబ్బందిని మద్యం మత్తులో ఉన్న మహిళ ముప్పు తిప్పలు పెట్టింది. పోలీసులు, ఇతరులపై దాడి చేసింది. మొత్తం మీద ఏదోలా ఆమెని సాధారణ స్థితికి తీసుకుని వచ్చిన తర్వాత చట్టపరమైన చర్యలు చేపట్టారు. మత్తు వీడిన తర్వాత ఆమెను కస్టడీ నుంచి విడుదల చేశారు.

కటక్ నగరంలో భారీ బందోబస్తు

- హోలీ వేడుకల సందర్భంగా..

భువనేశ్వర్: హోలీ వేడుకల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం నగరం అంతటా మొత్తం 22 ప్లాటూన్ల పోలీసు సిబ్బందిని మోహరించనున్నట్లు కటక్ డీసీపీ రిషికేశ్ ఖిలారి తెలిపారు. హోలీ వేడుకల సమయంలో హింసాత్మక ప్రవర్తన మరియు గుండాయిజం పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త సన్నాహాలతో కటక్ నగర పోలీసు కమిషనరేట్ సన్నద్ధంగా ఉందన్నారు.

మద్యం తాగి దుష్ప్రవర్తన చేస్తే కఠిన చర్యలు

హోలీ సందర్భంగా మద్యం సేవించకూడదని డీసీపీ తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. మద్యం సేవించి హోలీ ఆడుతున్నట్లు తెలిస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో హోలీ వేడుకల సమయంలో నగరంలోని అన్ని మద్యం దుకాణాలు మూసివేయబడతాయని ప్రకటించారు. ఉత్తర్వుల ఉల్లంఘనకు పాల్పడితే అక్రమ మద్యం అమ్మకంపై తక్షణ చట్టపరమైన చర్యలకు గురి అవుతారని స్పష్టం చేశారు.

మధ్యాహ్నం ఒంటి గంట వరకే...

హోలీ వేడులకలో అపశృతులు తలెత్తకుండా సజావుగా సాగేందుకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. నగరంలో హోలీ వేడుకలను మధ్యాహ్నం 12 గంటల నుండి 1 గంటల మధ్య ముగించుకోవాలని డీసీపీ సూచించారు. రంగుల సంబరాల తర్వాత నదులు ఇతరేతర జలాశయాల్లో స్నానం చేయకూడదని ఆంక్షలు విధించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో హోలీ రంగుల వేడుకల సందర్భంగా ఘర్షణలు వంటి సంఘటనల నివారణకు ప్రత్యేక పోలీసు బృందం నిఘా వేస్తుందన్నారు. కటక్ నగర వాసులు బాధ్యతాయుతంగా హోలీ జరుపుకుని పండుగ ఆనందంగా అవాంఛనీయ సంఘటనలు లేకుండా జాగ్రత్త వహించాలని పిలుపునిచ్చారు.

రూ. 31 లక్షల విలువైన గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులు

- ఆరుగురి అరెస్టు
- నిందితుల నుంచి తుపాకీ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కారు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న తుపాకీ

రాయగడ: గంజాయిని కారులో అక్రమంగా రవాణా చేస్తున్న ఆరుగురుని సదరు పోలీసులు స్థానిక హలువ సమీపంలోని ఆశీర్వాద్ ధాబా వద్ద పట్టుకున్నారు. వారి నుంచి 660 కిలోల గంజాయితో పాటు ఒక తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుండి స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు 31 లక్షల రూపాయలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. గంజాయి అక్రమంగా రవాణా జరుగుతుందనే సమాచారం తెలుసుకున్న పోలీసులు స్థానిక హలువ సమీపంలోని ఆశీర్వాద్ డాబా వద్ద కాపు కాశారు. ఈ క్రమంలో బిసంకటక్ నుంచి కొరాపుట్ వైపు వెళుతున్న కారును హలువా వద్ద పోలీసులు ఆపి తనిఖీ చేయగా అందులో గంజాయి పట్టుబడింది. దీంతో గంజాయితో పాటు ఒక తుపాకీని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో అరెస్టయిన రెడ్డి అమలారాజు, రెడ్డి అవినాస్, రెడ్డి ఆనంద, రంజిత్ కోరకొరియా, ముజాబుల్ హక్ ఆలీ, ఎ.వినోద్ కుమార్‌లను అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వైభవంగా డోలా పౌర్ణమి పూజలు



రాజగురు పోరిచ్చా మఠం నుంచి రాధాకృష్ణుల ఆగమనం



దోల యాత్రలో కార్యక్రమాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి



దాండియా నృత్యంలో మహిళలు



దోలా ట్యాంకు వద్దకు చేరిన రసికరాజ మఠం ఉత్సవ విగ్రహాలు

పర్లాకిమిడి: డోలా పౌర్ణమి సందర్భంగా డోలా ట్యాంకు వద్ద సందడిగా డోలా యాత్ర శుక్రవారం జరిగింది. యాత్ర ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, కలెక్టర్ బిజయ కుమార్ దాస్, పురపాలక సంఘం చైర్మన్ నిర్మలా శెఠి ముఖ్యఅతిథులుగా విచ్చేసి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించారు. చిన్నారులు రాధాక్రిష్ణుల నృత్యాలు, కళింగ వైశ్యం సంఘం తరఫున దాండియా నృత్యాలు, ఇతర కార్యక్రమాలు భక్తిపూర్వకంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం రాజగురువీధిలో వున్న పరిచ్చా మఠం, రసికరాజ మఠం, చిత్రకార వీధిలో కోకిలా మఠం, రాజగురు మఠం, కేవుటి వీధిలో ప్రసన్న వేంకటేశ్వర స్వామిలు వేంచేసి భక్తులకు దర్శనం కల్పించారు. డోలా యాత్ర ముగింపు సందర్భంగా డోలా ఉత్సవ కమిటీ, విశ్వహిందూ పరిషద్ భక్తులతో మందిరం నిండిపోయింది. భక్తులపై రంగులు జల్లి భక్తిపారవశ్యం అయ్యారు.

వసూల్ రాజాలపై విజిలెన్స్

- డీఎంహెచ్‌వో కార్యాలయంలో కీలకాధికారులపై నిఘా
- సాక్షి కథనాలను ప్రామాణికంగా విచారణ సాగిస్తున్న అధికారులు



వైద్యారోగ్య శాఖలో..

వసూల్ రాజాలు!

ఈ నెల 5న సాక్షిలో ప్రచురితమైన కథనం



జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయం

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖలో కొన్నాళ్లుగా సాగుతున్న అవినీతి అక్రమాలతో పాటుగా తాజాగా మొదలైన వసూల్ రాజాల అక్రమాలపై 'విజిలెన్స్' ప్రత్యేక దృష్టి సారించింది. ఈ అంతర్గత వ్యవహారాలపై ఈ నెల 5న వైద్య శాఖలో వసూల్ రాజాల పేరిట 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలపై విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు. అందుకు అనుగుణంగా కార్యాలయంలో పరిస్థితులుండటంతో సంబంధిత అధికారులపై నిఘా ఉంచారు. ఇప్పటికే రెండుసార్లు డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి చేరిన విజిలెన్స్ బృందానికి పరిపాలన విభాగం నుంచి ఎలాంటి సహకారం అందకపోవడంతో నేరుగా డీఎంహెచ్‌వో డాక్టర్ బాలమురళీకృష్ణతోనే మాట్లాడి పరిస్థితులను అడి గి తెలుసుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు నివేదికను సిద్ధం చేయనున్నారు.

సాక్షిలో వరుస కథనాలు...

డీఎంహెచ్‌వో కార్యాలయంలో వరుసగా జరుగుతున్న పలు అక్రమాలపై సాక్షిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవడం, అక్రమంగా రూ.లక్షల్లో వసూళ్ల చేయడంతో పాటు ఫేక్ జాయినింగ్ ఆర్డర్లు జారీ చేయడం వంటి అంశాలపై ఆధారాలతో సహా ప్రచురించిన సంగతి తెలిసిందే. వీటినే ప్రామాణికంగా తీసుకుని నిరుద్యోగ బాధితుల వివరాలతో పాటు అక్రమాలకు పాల్పడిన స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో కీలక సిబ్బంది, కాంట్రాక్ట్ ఉద్యోగుల తీరుపై చర్యలుండేలా విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. ఇప్పటికే చాలావరకు అక్రమాలతో పాటు ప్రస్తుతం ఏళ్ల నాటి నుంచి పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల విద్యార్హత సర్టిఫికెట్లు కూడా ఫేక్ అనే కథనాలు రావడంతో దీనిపైన కూడా విజిలెన్స్ దృష్టి పెట్టింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను ఇచ్చేసినట్లుగా ఆర్డర్లు జారీ చేయడంతో పాటు ఫోర్జరీ సంతకాలతో ఆన్‌లైన్‌లో జీతాలను జమ చేయడాన్ని విజిలెన్స్ అధికారులకు ఆశ్చర్యాన్ని కల్పించినట్లు సమాచారం. గత నెలలో విశాఖ డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు చేపట్టిన విచారణాంశాలను కూడా విజిలెన్స్ అధికారులు పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిసింది. త్వరలోనే అక్రమాలు, వసూల్ రాజాల బండారాలను విజిలెన్స్ అధికారులు ప్రత్యేక నివేదిక ద్వారా ప్రభుత్వానికి పంపించేలా సన్నద్ధమవుతున్నారు. దీంతో రెండు రోజులుగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో స్తబ్దత నెలకొందరు. కొందరు లాంగ్‌లీవ్‌లో వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిసింది.

క్లుప్తంగా

కొత్తూరు వైపు ఏనుగుల గుంపు

భామిని: ఇన్నాళ్లు భామిని మండలంలోని సంచ రించిన నాలుగు ఏనుగుల గుంపు శుక్రవారం శ్రీకాకుళం జిల్లా కొత్తూరు వైపు వెళ్లాయి. వసప, కుంటిభద్ర, సిరుసువాడ పంటపొలాల్లో ఏనుగులు సంచరిస్తున్నట్టు ఆటవీ శాఖాధికారులు తెలిపారు.

నేటితో చెరకు క్రషింగ్ పూర్తి

రేగిడి: మండలంలోని సంకిలి వద్ద ఉన్న ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో శనివారంతో చెరకు క్రషింగ్ పూర్తవుతుందని కర్మాగారం యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. స్థానిక విలేకరులతో శుక్రవారం మాట్లాడుతూ ప్రతి రోజు 4వేల పైచిలుకు టన్నుల చెరకు క్రషింగ్ చేశామని, ఇప్పటివరకు 3.50 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ పూర్తయిందన్నా రు. రైతులు కర్మాగారానికి చెరకును తరలించిన వారం రోజులకే బిల్లులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు వెల్లడించారు.

సెలవు రోజూ సర్వే

- ఉద్యోగులను వేధిస్తున్న కూటమి ప్రభుత్వం



రామభద్రపురంలో పీ-4 సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

రామభద్రపురం: సచివాలయాల ఉద్యోగుల పరిస్థితి దారుణంగా ఉంది.కూటమి ప్రభుత్వం రాకతో వారి మీద పని భారం వేసి గొడ్డు చాకిరీ చేయిస్తోంది. పనిదినాల్లోనే కాకుండా సెలవు రోజుల్లో కూడా కనీసం కుటుంబ సభ్యులతో గడపకుండా సర్వే పేరుతో వేధిస్తోంది. శుక్రవారం హోలీ సెలవు రోజున తప్పనిసరిగా పీ-4 సర్వే చేయాలని అధికారులు ఆదేశిచడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సర్వే చేశారు. రామభద్రపురం మండలంలో ప్రస్తుతం సర్వే చేసుకో..జీతం పుచ్చుకో అన్న వ్యవహారం గ్రామ సచివాలయ ఉద్యోగుల్లో ట్రెండింగ్‌గా మారింది. ప్రభుత్వం గ్రామ సచివాలయ ఉద్యోగులపై మెడపై కత్తి పెట్టి మరీ సర్వే చేయిస్తోంది.దీంతో సచివాలయాల ఉద్యోగులు నిద్రలేని రాత్రులు అనుభవిస్తున్నామని పేరు బయటకు చెప్పుకోలేని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారితే చాలు ఏ అధికారి నుంచి ఏ ఫోన్ వస్తుందోనని టెన్షన్ పడుతున్నామని, చివరికి బీపీలు, సుగర్‌లు కూడా వస్తున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా సర్వేయర్ల సంఘం ఎన్నిక

విజయనగరం ఫోర్ట్: గ్రామ సర్వేయర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కాశినాయుడు ఎన్నికయ్యారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో గ్రామ సర్వేయర్ల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుల ఎన్నిక శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా స్టేట్ కోఆర్డినేటర్‌గా భరత్, జిల్లా కార్యదర్శిగా దుర్గా మదీనా, జిల్లాస్పోర్ట్స్ సెక్రటరీగా జగదీష్, ఉపాధ్యక్షురాలిగా రమాదేవి, జాయింట్ సెక్రటరీగా లక్ష్మీప్రసాద్, జిల్లా ట్రెజరర్‌గా అజయ్‌కుమార్, జిల్లా ఉమెన్ వింగ్ కార్యదర్శిగా యోర్నా సాయి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుబాబు అభినందనలు తెలియజేశారు.

గడ్డి కుప్పలు దగ్ధం



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాలకొండ రూరల్: మండలంలోని పద్మాపురం గ్రామానికి చెందిన ఆలుబిల్లి చంద్రశేఖర్ గడ్డికుప్పలు శుక్రవారం దగ్ధమయ్యాయి. పశువుల దాణా నిమిత్తం పొలంలో కుప్పలు వేసిన గడ్డికుప్పల నుంచి ఒక్కసారిగా మంటలు, దట్టమైన పొగ ఆక్కడి పరిసరాలను చుట్టముట్టడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. తక్షణమే ఫైర్ అధికారులకు సమాచారం అందించగా ఎస్సై జామి సర్వేశ్వరరావు, సిబ్బంది, శకటంతో సహా ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. వేసవి నేపథ్యంలో ఈ తరహా ప్రమదాలను దృష్టిలో పెట్టుకుని గ్రామీణులు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫైర్ ఎస్సై ప్రజలకు అవగాహన కల్పించారు.

రికార్డు సృష్టికర్తకు సన్మానం



జయపవన్‌ను సత్కరిస్తున్న పుల్లెల శ్రీనివాసరావు

బొబ్బిలి: పాత బొబ్బిలికి చెందిన ఎంటెక్ విద్యార్థి 55 సెకెన్లలో హనుమాన్ చాలీసాను పఠించి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. జిల్లా కేంద్రంలోని కార్పొరేషన్ బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న వెలగాడ తాతబాబు కుమారుడు జయపవన్ కళ్యాణ్ హనుమాన్ చాలీసాను నిత్య పఠనంగా మార్చుకుని పట్టుసాధించాడు. ఆన్‌లైన్ పోటీలో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు ఇతని ప్రతిభను గుర్తించి బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పించినట్టు తెలిపారు. విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యుడు పుల్లెల శ్రీనివాసరావు, తదితరులు జయపవన్‌ను దుశ్శాలువతో సత్కరించారు.

ఫ్రైడే @39 డిగ్రీలు



ఎండదాటికి నిర్మానుష్యంగా మారిన పార్వతీపురం పాతబస్టాండ్ కూడలి

పార్వతీపురంటౌన్: భానుడు భగ్గుమంటున్నాడు. మార్చినెల రెండవ వారంలోనే ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరాయి. పార్వతీపురంలో అత్యధికంగా శుక్రవారం 39 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండదెబ్బకు మధ్యాహ్నం రహదారులు నిర్మానుష్యంగా మారాయి. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో సగటున 38–39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం నుంచి వేడి గాలుల ప్రభావం ఎక్కువగా కనిపించింది. ఏప్రిల్, మే నెలల్లోనూ ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జనం భయపడుతున్నారు. ప్రస్తుత వేసవి కాలంలో కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు వంటి ద్రవపదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని, అత్యవసర వేళ బయటకు వెళ్తే ఎండ సంరక్షణ చర్యలు తప్పనిసరని వైద్యులు చెబుతున్నారు. ఉపాధిహామీ వేతనదారులు, వ్యవసాయ కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.



జనసంచారం లేని పార్వతీపురం ఇందిరానగర్ కాలనీ కూడలి

జాగ్రత్తలు తప్పనిసరి

మార్చి నెల నుంచే ఎండ తీవ్రత పెరిగింది. వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలో తిరగకూడదు. రోజుకు 3 నుంచి 4 లీటర్ల నీరు తాగాలి. కొబ్బరిబొండాలు, మజ్జిగ, ఓఆర్ఎస్, గ్లూకోజ్, నిమ్మరసం వంటి ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవడం మంచిది. అత్యవసర వేళ బయటకు వెళ్లేవారు తాగునీరు, గొడుగును వెంట తీసుకెళ్లాలి. తెలుపు రంగు లేదా పలుచటి చేనేత వస్త్రాలు, తలకు టోపీ లేదా రుమాల్ ధరించాలి. బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు తిరగరాదు. శరీరాన్ని డీ హైడ్రేట్ చేసే ఆల్కహాల్, టీ, కాఫీ అతిగా తీసుకోవద్దు. – డాక్టర్ ఎస్.భాస్కరరావు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి, పార్వతీపురం మన్యం

నేటి నుంచి ఒంటిపూట బడులు

పార్వతీపురంటౌన్: పాఠశాలలకు నేటి నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయని జిల్లా విద్యాశా ఖాధికారి ఎస్.తిరుపతినాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. జిల్లాలో 10వ తరగతి పరీక్షలు నిర్వహించనున్న 67 పాఠశాలల్లో పరీక్షలు ముగిసేంత వరకు మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

బీసీల స్వయం ఉపాధికి రూ.23.24 కోట్లు

పార్వతీపురంటౌన్: జిల్లాలో బీసీ వర్గాల స్వయం ఉపాధికి బీసీ కార్పొరేషన్ నుంచి రూ. 23.24 కోట్లు మంజూరు చేస్తామని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో స్లాబ్–1 కింద 868 యూనిట్లకు రూ.13.02 కోట్లు, స్లాబ్–2 కింద 260 యూనిట్లకు రూ.6.50 కోట్లు, స్లాబ్–3 కింద 93 యూ నిట్లకు రూ.3.72 కోట్లు వెరసి 1221 యూనిట్లకు 23.24 కోట్లు అందజేస్తామన్నారు.

27 జనరిక్ ఫార్మసీలకు అవకాశం

25 జనరిక్ ఫార్మసీ యూనిట్లను ఏర్పాటుకు రూ.2 కోట్ల వరకు ఆర్థిక సహాయం అందుతుందని కలెక్టర్ తెలిపారు. యూనిట్ విలువ రూ.8 లక్షలు కాగా ఇందులో సబ్సిడీ రూ.4 లక్షలు, బ్యాంకు రుణం రూ.4 లక్షలుగా ఉంటుందని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు జనరి క్ ఫార్మసీ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవచ్చని, ఈబీసీకి ఒక యూనిట్, బ్రాహ్మణ వర్గానికి ఒక యూనిట్ కేటాయించామన్నారు. దీనికోసం ఈ నెల 22లోగా హెచ్‌టీటీపీఎస్://ఏపీఓబీఎంఎంఎస్.ఏపీసీఎఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి



విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు

- కార్మికులకు జీతాలు విడుదల చేయాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

విజయనగరం గంటస్తంభం: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్యాకేజీ నిధులు, కార్మికుల జీతాలకు నిధులు కేటాయించాలని, సొంత గనులు ఇచ్చి, ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ, శుక్రవారం విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం 4 సంవత్సరాలుగా కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తుంటే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా మోసపూరిత ప్రకటనలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సొంత గనులు లేక స్టీల్ ప్లాంట్ ఆర్థికంగా ఇబ్బంది పడుతుంటే నష్టాలకు కార్మికుల్ని బాధ్యులను చేస్తూ ప్లాంట్ నిర్వీర్యానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. 4 వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు నిలుపుదల చేశారని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ నిధులతో తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మోసపూరిత ప్రకటనలు ప్రజలు అర్థం చేసుకుంటారని, అప్పుడు ఈ ప్రభుత్వాలకు బుద్ధి చెప్పడం ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస, జిల్లా కార్యదర్శి జగన్మోహన్‌రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి రాము, వెంకటేష్ తదితరలు పాల్గొన్నారు.

‘దిశ’ నుంచి ‘శక్తి’

- ఆపదలో ఉన్న మహిళకు భరోసా
- రద్దీ ప్రాంతాల్లో మఫ్టీలో శక్తి టీమ్స్ పహారా



రద్దీ ప్రాంతాల్లో యాప్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్స్

విజయనగరం క్రైమ్: మహిళలకు భద్రత ఇచ్చేందుకు నాడు జగన్ ప్రభుత్వం హయాంలో వినూత్న పంథాలో ‘దిశ’ యాప్‌ను ప్రవేశపెట్టారు. ఆపదలో ఉన్న అమ్మాయి, మహిళ, ఉద్యోగిని ఇలా ఏ రంగంలో ఉన్న ఆడవారికైనీ గత జగన్ ప్రభుత్వం ‘దిశ’ యాప్‌ను ప్రవేశపెట్టి భరోసా, భద్రత కల్పించింది. దాని స్థానంలో ఇటీవల అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ‘శక్తి’మొబైల్ యాప్‌ను విడుదల చేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ‘శక్తి’ యాప్‌ను ప్రతి ఒక్క అమ్మాయి, మహిళ, గృహిణి, ఉద్యోగిని వినియోగించుకోవాలని ఎస్పీ వకుల్ జిందల్ పిలుపునిచ్చారు. మహిళలకు రక్షణ కవచంగా నిలిచే ‘శక్తి’ మొబైల్ యాప్‌ను స్వచ్ఛందంగా డౌన్‌లోడ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మహిళల భద్రతకు ప్రత్యేకంగా ‘శక్తి’ మొబైల్ యాప్‌ను ప్రతి మహిళ, యువత తన మొబైల్ ఫోన్‌లో డౌన్ లోడ్ చేసుకొని, తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ‘శక్తి’ యాప్ మొబైల్ ఫోన్‌లో నిక్షిప్తమై ఉంటే ఆపద సమయాల్లో పోలీసుల సహాయం సులువుగా పొందవచ్చని చెప్పారు. ముఖ్యంగా మహిళలు ఒంటరిగా ప్రయాణించే సమయాల్లో ‘శక్తి’ యాప్ రక్షణ కవచంగా నిలుస్తుందన్నారు. ఆపద సమయాల్లో సదరు మహిళలు పోలీసులకు సమాచారం అందించలేని పరిస్థితుల్లో కూడా ఈ మొబైల్ యాప్ పని చేస్తుందని చెప్పారు. అటువంటి సమయాల్లో కేవలం మొబైల్ ఫోన్‌ను గాలిలో షేక్ చేసినా, వారున్న లొకేషను, ఆడియో, వీడియో వివరాలు దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు చేరుతాయని, తద్వారా తమ సిబ్బంది సకాలంలో స్పందించి, కారకులైన వ్యక్తులపై చర్యలు చేపట్టి, బాధితులకు రక్షణగా నిలిచే అవకాశం ఉంటుందన్నారు. మహిళలు, విద్యార్థినులు తాము ఆపదలో ఉన్నామని భావిస్తే యాప్‌లోని ఎస్ఓఎస్. బటన్ ప్రెస్ చేయాలని సూచించారు. రాత్రి సమయాల్లో మహిళలు నైట్ షెల్టర్లలో వేచి ఉండేందుకు దగ్గరలో ఉన్న నైట్ షెల్టర్ల వివరాలు, మహిళలకు రక్షణగా నిలిచే చట్టాలు, హక్కులు, సమీపంలోని పోలీస్‌స్టేషన్ల ఫోన్ నంబర్లు, హెల్ప్‌లైన్ నంబర్లు అందుబాటులో ఉంటాయని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. కొత్తగా రూపొందించిన శక్తి టీమ్స్ జిల్లాలోని ఆర్టీసీ కాంప్లెక్సులు, బస్టాపులు, రైల్వే స్టేషన్లు, ముఖ్య కూడళ్లు, కళాశాలలను సందర్శించి, మహిళలు, విద్యార్థినులకు శక్తి మొబైల్ యాప్ పట్ల విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించినట్లు చెప్పారు.

ఆకట్టుకున్న గుర్రాల పరుగు ప్రదర్శన

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారి తీర్థమహోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన గుర్రాల పరుగు ప్రదర్శన ఉత్సాహంగా ఉల్లాసంగా సాగింది. ఈ గుర్రాల పరుగు ప్రదర్శనలో విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు చెందిన 10 గుర్రాలు పాల్గొన్నాయి. ఈ పరుగు ప్రదర్శనలో లక్కవరపుకోటకు చెందిన సింగపూర్ సత్యనారాయణ మురుగన్ గుర్రం ప్రథమ స్థానంలో నిలిచింది. రెండోస్థానంలో చేనుల అగ్రహారానికి చెందిన మణి జెస్సీ గుర్రం, మూడోస్థానంలో అంకుపాలానికి చెందిన విజయదుర్గా గుర్రం, నాల్గోస్థానంలో కోటనందూరుకు చెందిన శివరాజు బ్రదర్స్ గుర్రం నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులను గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు.

రైతు బజార్లను పరిశుభ్రంగా ఉంచాలి

విజయనగరం ఫోర్ట్: రైతు బజార్లను పరిశుభ్రంగా ఉంచాలని వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్ ఎం.వి.సునీత అధికారులను ఆదేశించారు. పట్టణంలో ఉన్న ఆర్అండ్‌బీ, ఎం.ఆర్.హెచ్, దాసన్నపేట రైతు బజార్లను ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల గుర్తింపు కార్డులపై ఆరా తీశారు. రైతులు తీసుకొస్తున్న టమాటా, డ్వాక్రా దుకాణాల్లో విక్రయిస్తున్న ఉల్లిపాయలను పరిశీలించారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మార్కెటింగ్‌శాఖ అధికారులకు సూచించారు. జాయింట్ డైరెక్టర్ పి.సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ పాల్గొన్నారు.

ఆపదలో ఆరోగ్యమిత్రలు..!

- ఆరోగ్య శ్రీస్థానంలో బీమా కంపెనీ తీసుకొస్తున్న సర్కారు
- ఉద్యోగాలు ఉంటాయో, ఊడతాయోనని ఆందోళన
- ఈనెల 17, 24 తేదీల్లో విధులు బహిష్కరించనున్న ఆరోగ్యశ్రీ సిబ్బంది



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న ఆరోగ్య మిత్రలు

విజయనగరం ఫోర్ట్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ (ఎన్‌టీఆర్ వైద్య సేవ) పథకంలో పనిచేసే ఆరోగ్య మిత్రల్లో ఆందోళన నెలకొంది. ఉద్యోగం ఉంటుందో, ఊడుతుందో తెలియక సతమతమవుతున్నారు. ఆరోగ్యశ్రీ స్థానంలో బీమా కంపెనీని కూటమి సర్కారు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి బీమా కంపెనీని తేవడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే బీమా కంపెనీ వస్తే ప్రస్తుతం ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలు, టీమ్‌లీడర్లు, ఆఫీస్ సిబ్బందిని కొనసాగిస్తారా? లేదా? అనే ప్రశ్న సర్వత్రా వినిపిస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వకపోవడంతో ఈనెల 10వతేదీ నుంచి ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేసే ఆరోగ్య మిత్రలు, టీమ్‌లీడర్లు, ఆఫీస్ సిబ్బంది విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేయాలని నిర్ణయించారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారులు ఈనెల 12న వారిని చర్చలకు పిలిచారు. చర్చలు విఫలం కావడంతో ఆరోగ్యశ్రీ సిబ్బంది ఈనెల17, 24 తేదీల్లో విధులు బహిష్కరించనున్నారు.

గత ప్రభుత్వం హయాంలో సంతోషంగా విధులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఆరోగ్య మిత్రలు ఎటువంటి ఆందోళన, ఒత్తిడి లేకుండా సంతోషంగా పనిచేశారు. ఉన్నతాధికారులు కానీ, జిల్లా అధికారులు కానీ మిత్రలపై ఎటువంటి ఒత్తిడి తెచ్చేవారు కాదు. దీంతో వారు కూడా తాము చేయాల్సిన విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించేవారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య మిత్రలు పనిచేస్తారు. ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్న వ్యాధులకు చికిత్స కోసం వచ్చే వారికి ముందుగా రిజిస్ట్రేషన్ చేసి సంబంధిత వైద్యుడి దగ్గరకు పంపిస్తారు. ఆస్పత్రిలో చికిత్సకోసం కానీ, శస్త్రచికిత్స కోసం చేరినట్లయితే వారికి సకాలంలో చికిత్స, శస్త్రచికిత్స జరిగేలా చూడడం ఆరోగ్య మిత్ర విధి. అదేవిధంగా ఆరోగ్యశ్రీ రోగులకు నాణ్యమైన భోజనం పెడుతున్నారా? లేదా? అని పర్యవేక్షించడం, ఎవరైనా ఆస్పత్రి సిబ్బంది సేవలు అందించడం కోసం చేతివాటం ప్రదర్శించినట్లయితే వారి ఫిర్యాదును కో ఆర్డినేటర్ దృష్టికి తీసుకెళ్లడం వారి విధి.

విధుల్లో 96 మంది మిత్రలు

ఆరోగ్యశ్రీ పథకంలో జిల్లాలో 96 మంది ఆరోగ్య మిత్రలు పనిచేస్తున్నారు. అదేవిధంగా జిల్లా కోఆర్డినేటర్ ఒకరు, జిల్లా మేనేజర్ ఒకరు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక ఆఫీస్ అసోసియేట్ ,నలుగురు టీమ్ లీడర్లు పనిచేస్తున్నారు.

జిల్లాలో నెట్‌వర్క్ ఆస్పత్రులు 30

జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు 30 ఉన్నాయి. గజపతినగరం, రాజాం, ఎస్.కోట ఏరియా ఆస్పత్రులు, బాడంగి, భోగాపురం, బొబ్బిలి, చీపురుపల్లి, నెల్లిమర్ల సీహెచ్‌సీలు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి విజయనగరం, విజయనగరం ఘోషాఆస్పత్రి, అభినవ ఆస్పత్రి ఎస్.కోట, ఎస్.కోట కొలపర్తి ఆస్పత్రి, విజయనగరం సాయి పీవీఆర్ ఆస్పత్రి, సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వెంకటరామా ఆస్పత్రి, ఆంధ్ర హాస్పిటల్, మారుతి ఆస్పత్రి, పీజీ స్టార్ ఆస్పత్రి, స్వామి కంటి ఆస్పత్రి, నెఫ్రాప్లస్ ఆస్పత్రి, నెల్లిమర్ల మిమ్స్ ఆస్పత్రి, మువ్వ గోపాల ఆస్పత్రి, గాయత్రి ఆస్పత్రి, పుష్పగిరి ఐ ఆస్పత్రి, తిరుమల నర్సింగ్ హోమ్, శ్రీనివాస్ నర్సింగ్ హోమ్, జీఎంఆర్ కేర్ ఆస్పత్రి, అమృత ఆస్పత్రి, ఎన్ఆర్ఐ ఆస్పత్రి, వెంకట పద్మ ఆస్పత్రులు నెట్‌వర్క్ పరిధిలో ఉన్నాయి. ఈ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య మిత్రలు షిఫ్టుల ప్రకారం పనిచేస్తున్నారు.

చర్చలు విఫలం



మా సమస్యలపై ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారులతో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో ఈనెల 17, 24 తేదీల్లో విధులు బహిష్కరించనున్నాం. బీమా కంపెనీ పరిధిలోకి వెళ్తే మా ఉద్యోగాలు ఉంటాయో, ఊడతాయో అన్న స్పష్టత లేదు. దీంతో ఏం జరుగుతుందోననే ఆందోళన ఉద్యోగుల్లో నెలకొంది.

జెర్రి పోతుల ప్రదీప్, ఆరోగ్య మిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఏటీఎం మోసాల ముఠా అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాంబాబు

- రూ.4లక్షల నగదు, 78 ఏటీఎం కార్డులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాంబాబు

పాలకొండ: ఏటీఎంల వద్ద మాటు వేసి డబ్బులు తీసేందుకు వెళ్లిన వారిని మాటల్లో పెట్టి వారి కార్డులు, డబ్బులు దొంగిలించే ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు డీఎస్పీ ఎం రాంబాబు ఇందుకు సంబంధించిన వివరాలు శుక్రవారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ముంబైకి చెందిన అయజ్ ద్వివేది, అప్సర్‌ఖాన్‌లు ఈ ఏడాది జనవరిలో పాలకొండలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద థామస్ అనే వ్యక్తిని మోసగించి ఏటీఎం కాజేసి నగదు విత్ డ్రా చేసుకున్నారు. దీనిపై జనవరి 17న పాలకొండ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో పోలీసులకు విస్తుగొలిపే విషయాలు వెలుగులోనికి వచ్చాయి. నిందితులిద్దరూ దేశవ్యాప్తంగా ఏటీఎంల వద్ద అత్యంత తెలివిగా మోసగించి నగదు కాజేస్తున్న విషయాన్ని గుర్తించారు. టెక్నికల్ సమస్యలు ఉన్న ఏటీఎంల వద్ద మాటు వేసి ఒకరు బయట వేచి ఉంటారు, మరొకరు లైన్‌లో ఉండి డబ్బులు తీయడానికి వచ్చిన వారికి సహాయం చేస్తున్నట్లు నటిస్తాడు. ఆ సమయంలో వారి పిన్ నంబర్‌ను గుర్తిస్తారు. అనంతరం ఏటీఎం నుంచి కార్డు తీసిన సమయంలో వారి వద్ద ఉన్న కార్డుతో నగదు తీసే వారికి అందించి నిందితుల వద్ద ఉన్న అదే రకం కార్డును అందజేస్తారు. ఈ విధంగా కార్డు మార్చిన తరువాత ఆ కార్డులో ఉన్న నగదు మొత్తం డ్రా చేసుకుని ఆ కార్డును మరొకరిని మోసం చేయడానికి ఉపయోగిస్తుంటారు. ఇందుకోసం వీరు నిరక్షరాస్యులు, వృద్ధులను టార్గెట్ చేసి మోసాలు చేస్తున్నారు. ఇటీవల నిందితులు మరోమారు పాలకొండలో నేరాల కోసం రావడంతో వారి కదలికలపై నిఘాపెట్టి పోలీసలుఉ అరెస్టు చేశారు. అనంతరం వారి నుంచి రూ.4లక్షల పదివేలు నగదు, స్విఫ్ట్ కారు, రెండు ఫోన్లు, 78 ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ రాంబాబు వివరించారు. ఆయనతో పాటు సమావేశంలో సీఐ చంద్రమౌళి, ఎస్సై ప్రయోగ మూర్తి ఉన్నారు.

రెండు పశువుల వ్యాన్‌ల సీజ్



అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యాన్

దత్తిరాజేరు: మండలంలోని ఎస్ బూర్జవలస పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న రెండు పశువుల వ్యాన్‌లను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పార్వతీపురం నుంచి పెదమానాపురం సంతకు ఒక వ్యాన్‌లో 11, మరో వ్యాన్‌లో ఆరు పశువులను తరలిస్తుండగా పట్టుకుని వ్యాన్ డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు చేశారు.